యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- స్వస్తివాచనంతో శ్రీకారం
- తొలిరోజు పూజల్లో సీఎం, మంత్రులు
- నేడు ధ్వజారోహణం.. దేవతాహ్వానం

యాదాద్రి భువనగిరి, మార్చి 11 (నమస్తే తెలంగాణ): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సీఎం రేవంత్, మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఉదయం గర్భాలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఈ వేడుకలను నిర్వహించారు. అనంతరం అంకురారోహణం, విష్వక్సేనారధన, రక్షాబంధనం చేపట్టారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం మృత్సంగ్రహణం నిర్వహించారు. ఆలయ మహా ఉద్ఘాటన తర్వాత రెండోసారి బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా, ఈ నెల 21 వరకు వేడుకలు కొనసాగనున్నాయి.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ

పట్టువస్త్రాల సమర్పణ

బ్రహోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. హెలికాప్టర్ ద్వారా గుట్టకు చేరుకున్న వారంతా రోడ్డు మార్గంపై కొండపైకి చేరుకున్నారు. సీఎంతోపాటు మంత్రుల బృందానికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం మంత్రులతోపాటు ప్రధానాలయానికి చేరుకుని గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సతీమణితో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేసి, స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. రాచకొండ సీపీ తరుణ్ జోషి, యాదాద్రి డీసీపీ రాజేశ్‌చంద్ర నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాలుగు గంటలపాటు దర్శనాలు నిలిపివేత

యాదగిరిగుట్ట ఆలయ బ్రహ్మోత్సవాల తొలిరోజున స్వామివారి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల పర్యటన నేపథ్యంలో భక్తులకు నాలుగు గంటలపాటు దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం తర్వాతే వారికి దర్శన భాగ్యం కల్పించారు. బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివారి నిత్య, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపేశారు. మంగళవారం ఉదయం అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, సాయంత్రం భేరీ పూజ, దేవతాహ్వాన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు 22,500 కోట్లు

- 4.5 లక్షల ఇండ్ల నిర్మాణం
- ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం
- పథకం ప్రారంభోత్సవంలో సీఎం

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు కేటాయించినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇండ్లను నిర్మిస్తామని చెప్పారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ నమూనాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరుతోనే పట్టాలు మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేద మహిళకు ఇల్లు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదని వెల్లడించారు. భద్రాచలం ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, రూ.500 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేదని చెప్పారు. తొలుత సీఎం, మంత్రులు భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. శ్రీరామనవమి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భటి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, కోమటిరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీదర్‌బాబు, పొన్నం, సీపీఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు.

'సీతారామ'ను పూర్తి చేయాలి

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీతారామ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భద్రాచలంలోని మార్కెట్ యార్డులో సోమవారం ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎండోమెంట్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ భద్రాచలం ఆలయ అభివృద్ధిపై చర్చించి, నిధులు విడుదల చేస్తామన్నారు.

మోదీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలేవి?

ఏడాదికి 2 కోట్ల చొప్పున యువతకు ఉద్యోగాలిస్తామని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పదేండ్లు పూర్తి కావొస్తున్నా ఆ హామీని పట్టించుకోవడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం భద్రాద్రి జిల్లా మణుగూరులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన నిర్వహించిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో రేవంత్ మాట్లాడారు. స్విస్ బ్యాంకుల్లోని నల్లధనం తెచ్చి నిరుపేదల ఖాతాల్లో జమ చేస్తామని మోదీ ప్రగల్భాలు పలికారని ధ్వజమెత్తారు. 2022కి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ ఇప్పుడు రైతు ఆత్మహత్యలకు కారణమయ్యారని ఆరోపించారు. 1969లో తెలంగాణ ఉద్యమం పాల్వంచ కేంద్రంగా పురుడు పోసుకున్నదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని బీజేపీ, బీఆర్‌ఎస్ చూస్తున్నాయని తెలిపారు. తాము గేట్లు తెరిస్తే బీఆర్‌ఎస్‌లో ఆ నలుగురు తప్ప ఎవరూ మిగలరని అన్నారు.

దళితద్వేషి కాంగ్రెస్

భట్టి ఏం పాపం చేశారని అవమానించారు: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- రేవంత్‌రెడ్డి అహంకారానికి నిదర్శనం: కవిత
- దేవుడి దగ్గరే ఇంత అవమానమా: బాల్క సుమన్
- అణగారిన వర్గాలకు జరిగిన అవమానమిది: దాసోజు
- లోయర్ ట్యాంకుబండ్ వద్ద ఎమ్మార్పీఎస్ నిరసన

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జరిగిన అవమానంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. భగవంతుడి సాక్షిగా ముఖ్యమంత్రి సమక్షంలోనే జరిగిన అవమానానికి రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలంటూ దళితులు నిరసనకు దిగారు. రెడ్లు పైన కూర్చుంటే దళితులు, బీసీలు సీఎం కాళ్ల వద్ద కూర్చోవాలా? అంటూ మండిపడుతున్నారు. బీఆర్‌ఎస్ సహా పలువురు రాజకీయ నాయకులు సీఎం వ్యవహారాన్ని తూర్పారబట్టారు. భట్టికి, కొండా సురేఖకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, దళిత, బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ దళిత ద్వేషి అని మరోమారు తేలిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

కవాడిగూడ: డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్ రాజు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భట్టికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ మాదిగ రాజ్యాధికార పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుమార్, ప్రవీణ్, జైరాంరాజు, అరుణ్ కుమార్, జీ మహేశ్, ఎస్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టిని అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎన్ బాలపీరు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. యాదగిరిగుట్టలో సోమవారం జరిగిన పూజా కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ, వెంకట్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద భట్టికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ రెండు గంటల పాటు ధర్నా చేపట్టారు. భట్టికి మాత్రమే అవమానం జరగలేదని మొత్తం దళితజాతికే అవమానం జరిగిందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు.

ఫ్యూడల్ మనస్తత్వానికి నిదర్శనం: దాసోజు శ్రవణ్

యాదగిరిగుట్ట ఆలయంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ సహా అగ్రవర్ణ మంత్రులు కుర్చీలపై కూర్చుంటే దళిత, బహుజన వర్గాలకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కొండా సురేఖ చెరోపక్క కిందకూర్చోవడం బాధ కలిగించిందని బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ అన్నారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవాళ్లు ఫ్యూడల్ మనస్తత్వాన్ని ప్రతిబింబించేలా వ్యవహరించకూడదని పేర్కొన్నారు. ఇది కేవలం భట్టి విక్రమార్కకో, కొండా సురేఖకో జరిగిన అవమానం కాదని, అణగారిన వర్గాలకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కాళ్లు బొబ్బలెక్కేలా తిరిగిన భట్టి కింద కూర్చున్నారని, అది కాంగ్రెస్ అంతర్గత వ్యవహారమే అయినా చూసేవాళ్లకు బాధ కలుగుతుందని పేర్కొన్నారు. ఇవి ఆధిపత్యవర్గాల ఫ్యూడలిజం వైఖరికి ప్రతిబింబాలుగా కనిపిస్తాయని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు యాదగిరిగుట్టలో జరిగిన అవమానం తెలంగాణ సమాజానికే సిగ్గుచేటని బీఆర్‌ఎస్ నాయకుడు తుంగుబాలు ఆవేదన వ్యక్తం చేశారు. భట్టి పాదయాత్ర చేస్తే పదవిలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి దళితులను దగా చేస్తున్నాడని మండిపడ్డారు నక్క వినయాలు, నాగుపాము విషం, తోడేలు క్రూరత్వం కప్పుకున్న సాధుజీవి రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్ పార్టీ దళిత ద్వేషి అని తేలిపోయిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ ప్రజలు, మీడియా, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర మంత్రులు దళిత సమాజాన్ని అవమానానికి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సామాజికవర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను అవమానించి కాంగ్రెస్ తన నిజస్వరూపం బయటపెట్టుకున్నదని మండిపడ్డారు. భట్టి రూపంలో యావత్ దళిత జాతిని కాంగ్రెస్ అవమానించిందని ధ్వజమెత్తారు. భట్టి ఏం పాపం చేశారని అవమానించారని ప్రశ్నించారు. సీఎం వెంటనే దళిత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జన్వాడలో దళితులపై దాడి జరిగితే ఖండించలేదని విమర్శించారు. గురుకులంలో పేద విద్యార్థులు వరుస ఆత్మహత్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని,. మృతుల కుటుంబాలను ముఖ్యమంత్రి పరామర్శించలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పేద వర్గాలపై ఓట్ల కోసం కపట ప్రేమ ఒలకబోస్తున్నది తప్ప, నిజంగా దళితులపై ప్రేమలేదని, విద్వేషం మాత్రమే ఉన్నదని ఆరోపించారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి: కవిత

నల్లగొండ: పవిత్ర యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సురేఖను కింద కూర్చోబెట్టడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంకారానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కుర్చీలు సరిపడా లేనప్పుడు అందరూ నిలబడే పూజ చేయాలని, ఇలా దళిత, బీసీ బిడ్డలను అవమానించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లగొండలో జరిగిన బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన కవిత విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలు, దళితులను రేవంత్‌రెడ్డి చిన్న చూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు బీసీశాఖకు మంత్రి కూడా లేరని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్‌ది కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ నేడు నల్లగొండను మూడు కుటుంబాలే ఎందుకు శాసిస్తున్నాయో చెప్పాలని నిలదీశారు. మహిళా బిల్లు కోసం ఆ రోజు జాగృతి ఆధ్వర్యంలో ధర్నా చేస్తే కేసీఆర్ 47 శాతం ఇస్తున్నారా? అని ప్రశ్నించిన రేవంత్ నేడు ఆడబిడ్డలకు అన్యాయం చేసి 12 నుంచి 20 శాతం మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. నిన్న హనుమంతురావును ఏడిపించిన పెద్దలు ఇప్పుడు మంత్రులు భట్టి, సురేఖను అమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సీఎం రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరగడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, వాసుదేవ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి భార్యను పైన కూర్చోబెట్టి బీసీ బిడ్డ అయిన మంత్రి కొండా సురేఖను కింద ఎలా కూర్చోబెడతారని ప్రశ్నించారు. దేవుడి దగ్గరే ఇంత అవమానం జరిగితే దళితజాతి ఎక్కడ చెప్పుకోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా స్పందించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీలుగా అవకాశమివ్వండి

- కోర్టు ఆదేశాలను అమలుచేయండి
- గవర్నర్‌కు దాసోజు, కుర్రా వినతి

గవర్నర్‌ను కలిసిన దాసోజు, కుర్రా సత్యనారాయణ తదితరులు

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకం విషయంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని బీఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ గవర్నర్‌కు విజ్ఞప్తిచేశారు. వారు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. గవర్నర్ కోటాలో తమను ఎమ్మెల్సీలుగా ఎంపికచేస్తూ గత ప్రభుత్వ మంత్రి మండలి తీర్మానించిన విషయాన్ని గుర్తుచేశారు. గవర్నర్ తమ పేర్లను తిరస్కరించిన విషయం తెలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయించామని తెలిపారు. ఇంతలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటలో ఆమిర్ అలీ ఖాన్, కోదండరాంల పేర్లను ఖరారుచేస్తూ గెజిట్‌ను విడుదల చేసిందని గుర్తుచేశారు. తమ పిటీషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, మంత్రిమండలి తీర్మానాన్ని తిరస్కరించడం ద్వారా రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని అభిప్రాయపడిందని తెలిపారు. కొదండరాం, ఆమిర్ అలీఖాన్‌ల నియామకం చట్టవిరుద్ధమని పేర్కొంటూ రద్దుచేసిందని తెలిపారు.

పేదలకు అర్హత లేదా?

ఎరుకల, విశ్వబ్రాహ్మణ కులాలకు చెందిన తమకు శాసనమండలిలో కూర్చునే అర్హత లేదా.. అని ప్రశ్నించారు. దాసోజు ఫౌండేషన్ పేరుతో కొవిడ్ సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. తమకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించాలని,కోర్టు ఆదేశాల ప్రకారం తమకు న్యాయం చేయాలని దాసోజు, కుర్రా విజ్ఞప్తిచేశారు.

మల్టీ జోన్-2 హెచ్‌ఎంల పదోన్నతులకు లైన్‌క్లియర్

- హైకోర్టు స్టే ఎత్తివేత పట్ల హర్షం
- ప్రక్రియ ప్రారంభానికి ఉపాధ్యాయ సంఘాల వినతి

హైదరాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నిలిచిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మళ్లీ ప్రారంభంకానున్నది. వీటిపై ఉన్న కేసులో సోమవారం హైకోర్టు తుది తీర్పు వెలువరించింది. దీంతో మల్టిజోన్–2లోని హెచ్‌ఎం పదోన్నతులపై స్టేను హైకోర్టు ఎత్తివేసింది. దీంతో టీచర్ల బదిలీలు, పదోన్నతులకు మార్గం సుగమమైంది. జీవో -317లో భాగంగా ఇతర జిల్లాల టీచర్లు రంగారెడ్డికి బదిలీ కాగా, రంగారెడ్డి జిల్లాలోని టీచర్లకు సీనియారిటీ జాబితాల్లో అన్యాయం జరిగిందని పలువురు కోర్టునాశ్రయించారు. దీంతో మల్టిజోన్ -2లో హెచ్‌ఎంల పదోన్నతులకు బ్రేక్‌పడింది. దీంతో బదిలీలు, మిగతా పదోన్నతులు చేపట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా కోర్టు స్టేను ఎత్తివేయడంతో పదోన్నతులకు అనుమతి లభించింది. మల్టీ జోన్ -2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులపై స్టేను హైకోర్టు ఎత్తివేయడం పట్ల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. పాత షెడ్యూల్‌ను కొనసాగించేందుకు కోర్టు తీర్పునివ్వడాన్ని ఆయనతో పాటు తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధానకార్యదర్శి నవాత్ సురేశ్ స్వాగతించారు. హెచ్‌ఎంల పదోన్నతులను తక్షణమే చేపట్టాలని కోరుతూ సోమవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు.

నేడు మంత్రివర్గం భేటీ

- మహిళలకు రూ.2,500.. రేషన్‌కార్డులపై నిర్ణయం

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): మరో ఒకటి రెండు రోజుల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడనుండగా.. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మంగళవారం జరుగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షుడు మధ్యాహ్నం 12 గంటలకు బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరుగనున్న ఈ భేటీలో పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒకటైన మహిళలకు రూ.2,500 ఆర్థికసాయంపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రేషన్‌కార్డుల కోసం ఇప్పటికే వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో.. ఈ అంశంపై కూడా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకం విషయంలో గతంలో తాము చేసిన సిఫారసులను పునఃపరిశీలించాలని మంత్రివర్గం గవర్నర్‌ను కోరే అవకాశాలు ఉన్నాయి. 2008 డీఎస్సీ బాధితులకు న్యాయం చేయడం, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన డీఏపై ఓ ప్రకటన వచ్చే అవకాశమున్నట్టు చెప్తున్నారు.

భట్టికి చిన్నపీట

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులను ఆలయ అధికారులు ఆహ్వానించారు. రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం ఆలయాన్ని సందర్శించారు. ప్రధానాలయంలో పూజలు, పట్టువస్త్రాల సమర్పణ తర్వాత సీఎం, మంత్రులకు వేదపండితులు ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, ఆయన సతీమణి గీతారెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి కూర్చునేందుకు ఆలయ అధికారులు కుర్చీలు వేశారు. డిప్యూటీ సీఎం భట్టి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను మాత్రం చిన్నపీటలపై కూర్చోబెట్టారు. ఇది వివాదానికి కారణమైంది. దళిత, బీసీ సామాజికవర్గాలకు చెందిన భట్టి, సురేఖకు అవమానం జరిగిందంటూ సోషల్ మీడియా వేదికగా విమర్శల జడివాన మొదలైంది. ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, దళిత, బీసీ సంఘాలు కూడా తీవ్రంగా స్పందించాయి. ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. వివాదంపై స్పందించిన ఆలయ అధికారులు మాత్రం సీఎం, డిప్యూటీ సీఎం కోసం వేసిన కుర్చీల్లో ఇతర మంత్రులు కూర్చోవడం వల్ల అప్పటికప్పుడు వేరే ఆసనాన్ని తెప్పించినట్టు పేర్కొన్నారు. మరోవైపు, నిన్నమొన్నటి వరకు ప్రభుత్వ ప్రకటనల్లో కనిపించిన భట్టి ఫొటోలు, ఇటీవల ఆయన ఫొటో లేకుండానే జారీ చేయడం కూడా వివాదాదస్పదమైంది.

ఉద్దేశపూర్వకమేనా?

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ విషయంలో ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, కలెక్టర్, ఇతర అధికారులు కచ్చితంగా ఉంటారు. అలాంటిది ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, ముగ్గురు మంత్రులు పర్యటిస్తున్నప్పుడు ప్రొటోకాల్ విషయంలో గందరగోళం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదే. అయితే, తాజా ఘటనలో మాత్రం ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి ఒక సామాజిక వర్గానికే మర్యాదలు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మాకు చెప్పక్కర్లేదు: మల్లు రవి

మల్లు భట్టి విక్రమార్కకు అవమానం జరిగిందని బీఆర్‌ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులను ఎలా గౌరవించాలో కాంగ్రెస్‌కు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. దళితులకు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చిందని గుర్తు చేశారు. దళితులను బీఆర్‌ఎస్ ఎలా అవమానించిందో అందరికీ తెలుసని మండిపడ్డారు.

ముందు వచ్చిన మంత్రులు ముందుగా కూర్చోవడం వల్లే: బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్టలో డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ వస్తున్న విమర్శలపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్పందించారు. ఆలయంలో భట్టికి కూడా కుర్చీ వేశారని, ఆయన కుర్చీ చిన్నగా ఉండడం, మిగతా కుర్చీలు పెద్దగా ఉండడం వల్ల డిప్యూటీ సీఎం కింద కూర్చున్నట్టుగా కనిపించిందని వివరణ ఇచ్చారు. ముందుగా వచ్చిన మంత్రులు ముందుగా కూర్చోవడం, చివరన వచ్చిన మంత్రులు చిన్న కుర్చీల్లో కూర్చోవడంతోనే ఇలా జరిగిందని పేర్కొన్నారు. మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖను అవమానించినట్టు సోషల్ మీడియాలో దుష్ప్రచారం తగదన్నారు. అందరికీ సమానంగా గౌరవించామని, కేటాయించిన సీట్లు హెచ్చుతగ్గుగా ఉండడం వల్ల దానిని లోపంగా చూస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధరణి స్పెషల్ డ్రైవ్ వారం పొడిగింపు

- ధరణిలో మార్పుల తర్వాతే దరఖాస్తుల పరిష్కారం

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో వారం పొడిగించింది. సోమవారం నుంచి ఈ నెల 17 వరకు డ్రైవ్ కొనసాగుతుందని సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌ను ఈ నెల 1న ప్రారంభించింది. మొత్తం 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, 9 రోజుల్లోగా పరిష్కరిస్తామని ప్రకటించింది. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు ఏమిటి? దరఖాస్తుల పరిశీలనకు ఎంత సమయం పడుతుంది? వంటి వివరాలేవీ తెలుసుకోకుండా కేవలం ఎలక్షన్ స్టంట్‌గా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం వల్లే అభాసుపాలైనట్టు ప్రభుత్వం గుర్తించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయటంతోపాటు తమ ప్రభుత్వ ఘనతగా చెప్పుకోవాలని ఆరాటపడిందనే విమర్శలు ఉన్నాయి. 10వ తేదీ నాటికి ఎలక్షన్ కోడ్ వచ్చేస్తుందని, ఆ తర్వాత 2, 3 నెలలపాటు ప్రజలు మర్చిపోతారని ప్రభుత్వం భావించింది. కానీ పథకం రివర్స్ అయ్యింది. ఎన్నికల కోడ్ రాకపోగా.. దరఖాస్తుల పరిశీలన ప్రహసనంగా మారింది. 9 రోజుల్లో కనీసం ఎన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యాయో చెప్పుకోలేని దుస్థితికి చేరింది. ఈ నేపథ్యంలో డ్రైవ్‌ను మరో వారం పొడిగించిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మార్పుల తర్వాతే దరఖాస్తుల పరిష్కారం

ధరణి పోర్టల్‌లో మార్పులు చేసిన తర్వాతే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం మొదలవుతుందని ధరణి కమిటీ సభ్యులు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో సుమారు లక్ష దరఖాస్తులకు సంబంధించిన నివేదికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు, జాయింట్ కలెక్టర్లకు అధికారం ఇచ్చిన తర్వాతే వీటికి పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ధరణి కమిటీ సభ్యులు సునీల్ కుమార్, కోదండరెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. డ్రైవ్ మొదలైనప్పటి నుంచి మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని, రైతుల్లో ఆశ మొదలైందని తెలిపారు.

బీకాం, బీఏకు కొత్త కరికులం

హైదరాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ) : డిగ్రీలోని బీఏ, బీకాం కోర్సులకు కొత్త కరికులం రూపకల్పనకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కసరత్తు కొలిక్కి వచ్చింది. 2024 -25 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని 21 అటానమస్ కాలేజీల్లో ఈ కరికులాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా అమలుచేయాలని నిర్ణయించింది. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి ఈ కొత్త కరికులం అమలుపై సమీక్షించారు. బీఏ (హెచ్‌ఈపీ), బీకాం (ఫైనాన్స్) కోర్సులకు నూతన కరికులాన్ని సిద్ధం చేశారు. విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడం, ఉద్యోగాలను సిద్ధం చేయడంలో భాగంగా అబెరిస్ట్‌విత్, బంగోర్ వేల్స్ వర్సిటీల సహకారంతో ఈ కరికులాన్ని అభివృద్ధిచేశారు. కోర్సుల్లో అంతర్భాగంగా ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్‌లను అమలుచేస్తారు. ఈ నెల 16న వర్చువల్‌గా వేల్స్ విశ్వవిద్యాలయాల నిపుణులు మన ఫ్యాకల్టీకి అవగాహన కల్పిస్తారు. ఆ తర్వాత ఫ్యాకల్టీకి ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. సమావేశంలో వీసీలుడీ రవీందర్,విజ్ఞలత, ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, కరికులం డైరెక్టర్ ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం

1వ అంతస్తు, '' కార్పొరేట్ భవన్'', బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068,

ఫోన్ నం.లు 040-29803086/3186, ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in

గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో: హైదరాబాద్ వద్ద (ప్రారంభ అధికారపరిధి)

కంపెనీల చట్టం, 1956 విషయంలో

M/s. శ్రీ విష్ణుప్రియ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో

కంపెనీ పిటీషన్ నం. 168/2002

ఇ-వేలం ద్వారా అసెట్లు/ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన

గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్ వద్ద తేది: 05.01.2024 గల ఉత్తర్వులు ప్రకారం, కాగోరు కొనుగోలుదారులు నుండి ''**ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదిక**''పై కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క దిగువ అసెట్లు/ఆస్తులు అమ్మకానికి సంబంధించి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

అసెట్లు/ఆస్తుల యొక్క లాట్ నం. మరియు వివరణ	రిజర్వు ధర (రూ.లక్షలలో)	బయానా (EMD) (రూ.లక్షలలో)	బిడ్ పెంపుదల విలువ (రూ.లక్షలలో)
లాట్ నం.1: ఆంధ్రప్రదేశ్, నంద్యాల జిల్లా, పాణ్యం గ్రామము వద్ద గల ఫ్యాక్టరీ ఆవరణ వద్ద భవనాలు, సివిల్ పనులు/కట్టడాలతో పాటు వివిధ సర్వే నంబర్లలోని సుమారు ఎ. 41.09 సెంట్లు భూమి.	3327.00	332.00	5.00
లాట్ నం.2 : ఆక్జిలరీ ఎక్విప్‌మెంట్, ఎలక్ట్రిక్ DC మోటార్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ మరియు మోటార్స్, ఎలక్ట్రికల్ కాంపోనెంట్స్ మరియు ఎక్విప్‌మెంట్స్, ఫ్యాబ్రికేటెడ్ గాల్వనైజ్డ్ స్ట్రక్చరల్ పార్ట్స్, క్రేన్స్, BAF మెటీరియల్స్ మరియు ప్రొటెక్టివ్ కవర్స్, జనరేటర్స్, లైటెనింగ్ అరెస్టర్స్, గ్యాస్ సర్క్యూట్ బ్రేకర్స్ మొదలగు వాటితోపాటు రోలింగ్ మిల్ మరియు స్కిన్ పాస్ మిల్ కలిగిన ప్లాంట్ & మెషినరీ.	86.00	8.60	1.00
లాట్ నం.3 : లాట్ నం. 1 మరియు లాట్ నం.2లో తెలిపిన కన్సాలిడేటెడ్ మరియు కాంపోజిట్ అసెట్లు/ఆస్తుల మొత్తం.	3413.00	340.60	6.00

గమనిక: i) 03.04.2024 & 04.04.2024 తేదీలలో ఉ. 11.00గం. నుండి సా. 5.00గం.మధ్య పాణ్యం గ్రామం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్ద గల పై అసెట్లు/ఆస్తులను తనిఖీ చేసుకోవచ్చు.
ii) ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు టెండరుదారులు అఫీషియల్ లిక్విడేటర్ అకౌంట్ అనగా "EMD ACCOUNT", కరెంట్ అకౌంట్ No.0207002100146966, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ట్రూప్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, IFS కోడ్: PUNB0020700లో NEFT/RTGS విధానం ద్వారా రూ. 2,000/- (రూపాయలు రెండు వేలు మాత్రమే)ల వాపసు ఇవ్వబడని మరియు సర్దుబాటు చేయబడని ఇ-వేలం పార్టిసిపేషన్ రుసుము చెల్లించాల్సి వుంటుంది (ప్రతి లాట్‌కి) మరియు దానిని 15.04.2024న సా. 4.00 గంటల లోగా డిపాజిట్ చేయవలెను.
iii) టెండరుదార్లు వెబ్‌సైట్: https://ol.auctiontiger.net ద్వారా తమ ఆన్‌లైన్ ఆఫర్ దాఖలు చేయాలి. అఫీషియల్ లిక్విడేటర్ ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్య, నెట్‌వర్క్ సమస్య, సిస్టమ్ క్రాష్ డౌన్, విద్యుత్ వైఫల్యం మరియు అటువంటి ఇతర కారణాలకు బాధ్యత వహించరు.
iv) ఇ-వేలం గురించి వివరాలు/ సహాయం/విధానం/ఆన్‌లైన్ శిక్షణ కొరకు కాగోరు బిడ్డర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్) కస్టమర్ కేర్ నంబర్‌పై సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవచ్చును. మొబైల్ నం. +91 9722778828.
v) అఫీషియల్ లిక్విడేటర్ అకౌంట్ అనగా "EMD ACCOUNT", కరెంట్ అకౌంట్ No.0207002100146966, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ట్రూప్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, IFS కోడ్: PUNB0020700లో NEFT/RTGS విధానం ద్వారా బయానా మొత్తం (వడ్డీ లేదు) డిపాజిట్ చేయాలి. బయానా డిపాజిట్ చేయుటకు ఆఖరి తేది 15.04.2024న సా. 4.00 గంటలలోగా మరియు మద్దతు డాక్యుమెంట్లుతో పాటు ఆన్‌లైన్ ఆఫర్ /బిడ్ ఫారం దాఖలు చేయుటకు ఆఖరి తేది 16.04.2024న మ. 3.30 గం.లోగా.
vi) ఇ-వేలం వెబ్‌సైట్ https://ol.auctiontiger.net ద్వారా ఇ-వేలం అమ్మకం పూర్తి అయ్యేముందు చివరి నిమిషంలో బిడ్ వేయబడితే ప్రతిసారీ 10 నిమిషాల ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్‌తో 19.04.2024న ఉ. 11.30 గం. నుండి మ. 2.30గం. మధ్య నిర్వహించబడుతుంది.
vii) అమ్మకం గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్ యొక్క నిర్ధారణకు లోబడి ఉంటుంది. అఫీషియల్ లిక్విడేటర్ మరియు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం ఎటువంటి కారణాలు తెలుపకుండా ఏదైనా ఆఫర్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు వారి హక్కులు కలిగి ఉన్నారు.
viii) కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో ఆసక్తి కలిగిన సెక్యూర్డ్ క్రెడిటార్స్/ అన్‌సెక్యూర్డ్ & ప్రిఫరెన్షియల్ క్రెడిటార్స్/ కంట్రిబ్యూటార్స్/ కేంద్ర & రాష్ట్ర ప్రభుత్వ అథారిటీలు/సంస్థలు మరియు అన్ని ఇతర పార్టీలకు నోటీసుగా ఈ అమ్మకం ప్రకటనను పరిగణించవలెను.
ix) కాగోరు కొనుగోలుదారు ప్రతిపాదిత ఇ-వేలంలో పాల్గొనుటకు ముందు ఏవైనా అవసరమైన వాటికి సంబంధించి తమకుతాము పూర్తిగా సంతృప్తి పడేందుకు ప్రకటన తేది నుండి పైన తెలిపిన తనిఖీ తేది వరకు ఏదైనా పని రోజున మ. 2.00 గం. నుండి మ. 3.00 గం.మధ్య అఫీషియల్ లిక్విడేటర్, హైదరాబాద్ వారి కార్యాలయాన్ని దర్శించి సంబంధిత భూమి డాక్యుమెంట్లను పరిశీలించుకోవచ్చు మరియు రెవెన్యూ/సంబంధిత అథారిటీల నుండి నేరుగా సంబంధిత రెవెన్యూ రికార్డులు/లొకేషన్ మ్యాప్ కూడా పరిశీలించుకోవచ్చు.
x) లాట్ నం.3 (లాట్ నం.1 & లాట్ నం.2 యొక్క కన్సాలిడేటెడ్ మరియు కాంపోజిట్) కొరకు తమ బిడ్ దాఖలు చేసిన బిడ్డర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
xi) అమ్మకం నియమ నిబంధనలతోపాటు పై ఇ-వేలం యొక్క ఇతర వివరాలు వెబ్‌సైట్ https://ol.auctiontiger.netలో లభిస్తాయి.
xii) పై నియమ నిబంధనలను ఏ సమయంలోనైనా గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం/ అఫీషియల్ లిక్విడేటర్ ద్వారా సడలించవచ్చును/ రద్దు చేయవచ్చును/తదుపరిగా పేర్కొనవచ్చును.

తేది: 05.03.2024
ప్రదేశం: హైదరాబాద్

సం/- (U.K.సాహూ, ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్